క్లుప్తంగా

ఘనంగా కపిల మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని ప్రసిద్ధ కపిలమల్లేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ సమేత కపిల మల్లేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు యలమంచిలి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, ప్రముఖ న్యాయవాది విన్నా ప్రకాష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రకాష్ సొంత ఖర్చుతో పట్టణంలోని అర్చకుల సతీమణులకు చీరలు పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు

నరసాపురం: ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు రూ.3 లక్షలు సబ్సిడీతో కూడిన రుణం ఇవ్వాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీహరిరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంజుమన్ సంఘ భవనంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లున్నారని చెప్పారు. కార్మిక శాఖ సంక్షేమ బోర్డు నుంచి గుర్తింపు పొందిన ఎలక్ట్రికల్ వర్కర్లను తీసుకుని, వారికి బోర్డు నుంచి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నరసాపురం శాఖ గౌరవ అధ్యక్షుడు ఉంగరాల కృష్ణమూర్తి, అధ్యక్షుడు కడలి రాంబాబు, ఉపాధ్యక్షుడు మాటూరి సుధాకర్, కార్యదర్శి కర్రి సుధాకర్, రావి రమేష్‌బాబు, ఎండీ వలీ పాల్గొన్నారు.

బోదె ఆక్రమణతో ఇబ్బందులు



కాపవరం రోడ్డులో రెవెన్యూ బోదె ఆక్రమణతో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

పాలకొల్లు అర్బన్: మండలంలోని కాపవరం వెళ్లే రోడ్డులో రెవెన్యూ బోదె ఆక్రమణతో బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం వర్షం కురవడంతో నీరు రోడ్డుపై నిలిచింది. దీంతో వాహనచోదకులు, నడిచే వెళ్లేవారు ఇబ్బందులు పడ్డారు. రెవెన్యూ బోదె ఆక్రమణ విషయంలో గతంలో రెవెన్యూ అధికారులు సంబంధిత రైతుకి నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ బోదెను ఆక్రమించి దానిపై చెరువులకు ఉపయోగపడే మెటీరియల్ జాగ్రత్త చేసుకోవడానికి షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డు తొలగిస్తానని బోదె ఆక్రమించిన రైతు రెవెన్యూ అధికారులకు హామీ ఇచ్చారు. నేటికీ షెడ్డు తొలగించలేదు. దీంతో వర్షం కురిసినప్పుడు రోడ్డుపై నీరు చేరుతోంది. వడ్లవానిపాలెం గ్రామ వైసీపీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు తక్షణం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని ఏసురాజు అన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

సాక్షి, భీమవరం : క్రీడల ద్వారా యువత ఆత్మ స్థైర్యాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతి రాజు అన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఫుట్‌బాల్ లీగ్ పోటీలను సోమవారం టాస్ వేసి ప్రారంభించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ఆరు టీములు పాల్గొంటాయన్నారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేమిరెడ్డి హరికృష్ణ, వానపల్లి రమేష్, క్రీడల కన్వీనర్ పి.సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ పీడీ హరిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

లలిత కళల శిక్షణ ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్) : స్థానిక ఏఎస్‌ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో 30 రోజులపాటు నిర్వహించనున్న ఉచిత లలిత కళల శిక్షణా శిబిరాన్ని సోమవారం అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. యోగా, కరాటే, నృత్యం, సంగీతం, లలిత కళల్లో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. సమితి కార్యదర్శి సీహెచ్ ఏవీడీ సుబ్రహ్మణ్యం రాజు, రుద్రరాజు వేణుగోపాలరాజు పాల్గొన్నారు.

కార్మికుల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి

- ఘనంగా మేడే వేడుకలు
- పలు చోట్ల ర్యాలీలు



నరసాపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



ఆచంటలో మేడే ప్రదర్శనలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్

నరసాపురం: కార్మికుల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. నరసాపురంలో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకను ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో జెండాలు ఆవిష్కరించారు. బస్టాండ్‌లో కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు నెక్కంటి సుబ్బారావు, కవురు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, తెలగంశెట్టి సత్యనారాయణ, పొగాకు నారాయణరావు,ఆ రేటి మత్యుంజయ, పొన్నాడ రాము నాయకత్వం వహించారు.

సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ

మొగల్తూరు: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ, జట్టు కార్మికులు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉద్యోగులు, పంచాయతీ వర్కర్లు, నాయకులు తెలగంశెట్టి సత్యనారాయణ, యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.

లారీస్టాండ్‌లో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లారీస్టాండ్‌లో మేడే ప్రపంచ కార్మిక దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం లారీ స్టాండ్‌లో లారీ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ పైలా సింహాచలం మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గెంజి మొరార్జీరాజు, లారీ కార్మికులు ప్రభాకర్, అంజిబాబు, ఆది శ్రీనురాజు పాల్గొన్నారు.

జిన్నూరులో..

పోడూరు: జిన్నూరులో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకను ఘనంగా నిర్వహించారు. నర్సరాజునగర్‌లో పార్టీ గ్రామ కార్యదర్శి కొప్పర్తి నర్సింహారావు మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. వంతెన సెంటర్, కొప్పర్తి సూర్యనారాయణ స్మారక స్థూపం, భూపయ్యచెరువు ప్రాంతాల్లోను పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళాబత్తుల గాంధీ, పెదకాపు, కిలారి సాంబయ్య పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలను బీజేపీ కాలరాస్తోంది

పెనుగొండ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను కాలరాస్తోందని సీపీఎం మాజీ శాసన సభ్యుడు దిగుపాటి రాజగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ఆచంటలో స్థానం భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం నుంచి కచేరీ సెంటర్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

పెనుగొండ మండలంలో

పెనుగొండ మండలంలో పెనుగొండ, సిద్ధాంతం, వడలి గ్రామాల్లో సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో మేడే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్మికులు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతుల ఇక్కట్లు



సరిపల్లిలో తడిసిన వరిపనలను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నమైన రైతు



కవిటంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి సత్యనారాయణ

నరసాపురం రూరల్: మండు వేసవిలో వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో ఈదురుగాలులు వీస్తూ అకాల వర్షం కురుస్తుండటంతో రైతులు కళ్లాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్ర అగచాట్లు పడాల్సి వస్తోంది. సోమవారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. సోమవారం వేకువజాము నుంచి భారీ వర్షం కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా ముమ్మరంగా వరి కోతలు చేపట్టడంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు పంటను కాపాడుకోవడానికి బరకాలు కప్పి ఉంచే పనుల్లో నిమగ్నమయ్యారు. పలు చోట్ల కోసిన వరి పైరును ఒడ్డుకు తెచ్చి నూర్పిడి చేసేందుకు సిద్ధంచేసిన క్రమంలో వర్షం వల్ల తడిసి ముద్దయ్యింది. నరసాపురం వ్యవసాయశాఖ ఏడీఏ ఈదా అనిల్‌కుమారి మాట్లాడుతూ వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తడిచిన ధాన్యం మొలకెత్తి, రంగు మారకుండా ఉండేందుకు కిలో కల్లు ఉప్పును 10కిలోల ఊకతో కలిపిన మిశ్రమాన్ని ధాన్యాన్ని పొరలుగా పోసి కలపాలన్నారు. నేలకొరిగిన వరిపైరు, పనలపై ఉన్న చేలల్లో, వర్షం తగ్గాకా నీటిని బయటకు తీసివేసి ఒకలీటరు నీటికి 20 గ్రాముల కల్లుప్పు చొప్పున కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

రైతులను ముంచిన అకాల వర్షం

మొగల్తూరు: గత రాత్రి నుంచి కురిసిన అకాల వర్షానికి రైతు కుదేలయ్యాడు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరుకు సుమారు 48.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ రైతులతో పాటు మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోయారు. కోసిన పనలను చేల్లో ఆరబెట్టగా పూర్తిగా తడిసి ముద్దయ్యింది. రాసులుగా పోసి బరకాలు కప్పినా చుట్టూ నీరు చేరడంతో ధాన్యం తడిసింది. ఇప్పటికే మామిడి దిగుబడి తగ్గిందని, ఉన్న కాయలకు మంగు తెగులు సోకడంతో తోటలు కొన్న కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారు. రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్, పాతకాలువ సెంటర్, మసీదు వీధి, స్టేషన్ రోడ్డు, పెద్ద గొల్లగూడెం రోడ్డులో వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

తడిసిన వరిపనలపై ఉప్పు ద్రావణం చల్లాలి

పోడూరు: తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణం చల్లడం ద్వారా గింజ మొలకెత్తకుండా పంటను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ రైతులకు సూచించారు. కవిటంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని, దెబ్బతిన్న వరి చేలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఆర్‌బీకే ఇన్‌ఛార్జి ఎ.నర్సింహమూర్తి, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

దేశ శాంతి కోసం సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న విజయ గోపాలకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: దేశ శాంతి కోరుతూ కాశీ నుంచి రామేశ్వరం వరకూ సైకిల్ యాత్ర చేస్తున్నట్లు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సింగనూర్ గ్రామానికి చెందిన చాట రాజుల విజయ గోపాల కృష్ణ తెలిపారు. సోమవారం పంచారామ క్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ దేశ శాంతి, జంతు, వన సంరక్షణ కోరుతూ ఈ యాత్రను 2022 మార్చి 11న ప్రారంభించానన్నారు. ఇప్పటికి 36 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానన్నారు. స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ వద్ద కాకిలేరు గ్రామమని వ్యవసాయం నిమిత్తం కర్ణాటక వెళ్లి అక్కడ స్థిరపడినట్లు తెలిపారు. ఈయన యాత్రను స్వాగతిస్తూ స్థానికులు ముక్కు లక్ష్మీనరసింహం, పిల్లా శ్రీను, కొరగింజల హనుమంతరావు తదితరులు ఆర్థిక సహాయం అందజేశారు.

సీఎం జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పెనుమర్రులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలి: సీఎం జగనన్న పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. అడవిపాలెం, పెనుమర్రు గ్రామాలలో జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా గత ప్రభుత్వాల పాలనకు, జగనన్న పాలనకు మార్పు గుర్తించాలని కోరారు. జగనన్న పాలనలో పార్టీ, కులం, మతం, వర్గ భేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగనన్నకు రానున్న ఎన్నికలలో ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు. అడవిపాలెం పంచాయతీ గగ్గిపర్రులో జిల్లా పరిషత్ నిధులు రూ.20 లక్షలు, గడప గడపకూ మన ప్రభుత్వ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన 580 మీటర్ల సిమెంట్ డ్రెయిన్, అడవిపాలెంలో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును, పెనుమర్రులో గడపగడపకూ మన ప్రభుత్వ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన 178 మీటర్ల సిమెంట్ డ్రెయిన్, జిల్లా పరిషత్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, వైఎస్సార్ సీపీ అడవిపాలెం గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు తోట రామకృష్ణ, సర్పంచ్‌లు కవురు గోపి, చిలుకూరి సుబ్బారావు చౌదరి, అనిశెట్టి మల్లిక, ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, కవురు నాగలక్ష్మి, మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, నాయకులు పొత్తూరి సోమరాజు, పాకా సూర్యనారాయణ, బుంగా జయరాజు, సిర్రా నాగరాజు, గంజి భవాని, యడ్ల శ్రీనుకుమార్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల ద్వారా లక్ష్య సాధన



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పాలకొల్లు సెంట్రల్: పోటీ పరీక్షల్లో సత్తాచాటి ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చని నరసాపురం సబ్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. సోమవారం స్థానిక ఎంఎంకెఎస్ఎం ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పరీక్ష విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా 12 ఏళ్లుగా విద్యార్థులను ఉన్నత విద్యా వంతులుగా తీర్చడంలో విద్యా చైతన్య సమాఖ్య సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. సబ్ కలెక్టర్ కావాలని 8వ తరగతిలో నిశ్చయించుకున్నానని ఆ సంకల్పంతోనే నేడు మీ ముందు ఇలా నిలబడి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రతి విద్యార్థి ముందుగా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని పట్టుదలతో సాధించాలని సూచించారు. అనంతరం గత మార్చిలో నిర్వహించిన పాలకొల్లు డివిజన్ స్థాయి ప్రతిభా పాటవ పరీక్ష ఫలితాల్లో విజేతలైన విద్యార్థులకు రూ. 40 వేలు విలువైన బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, కొంతేరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కానుకొలను శ్రీనివాసరావు, విద్యా చైతన్య సమాఖ్య సభ్యులు పోలిశెట్టి శ్రీశ్రీ, మంచెం ఉమామహేశ్వరరావు, తోలేటి గాంధీ, వంగా కరుణ కుమార్, చేగొండి కరుణకుమార్, మంచెం కనకరాజు, మేడిశెట్టి గణేష్, కింజరావు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: ఆసుపత్రి అభివృద్ధికి ఇటువంటి దాతల సహకారం ఎంతగానో దోహదపడుతుందని సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చలసాని జిజియా, గాంధీ చౌదరి దంపతుల పేరున వారి కుమారులు ఆంధ్ర మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, చలసాని శ్రీకృష్ణులు రూ. 3 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ దాతలను అభినందించారు. జిల్లా వైద్యశాఖ సమన్వయ అధికారి డాక్టర్ ఎం వీరాస్వామి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీ, ఉన్నమట్ల కబర్ది, అల్లు రాధాకృష్ణ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ గీతా కుమారి, రావూరి చాచా, పడాల రామాంజనేయులు, సూపరింటెండెంట్ జి ప్రభాకరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు



లంకలకోడేరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి డా. వి వరప్రసాద్

పాలకొల్లు అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని జిల్లా ఉపవైద్యాధికారి డా.వి వరప్రసాద్ అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని లంకలకోడేరు పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి గ్రామంలో జరిగే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో గర్భిణులను, బాలింతలను, వ్యాధిగ్రస్తులను గుర్తించి పరీక్షలు చేసి మందులు అందజేయాలని సూచించారు. అనంతరం ఆయన ఆగర్రులో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డా. అద్దాల ప్రతాప్‌కుమార్, డా.నవ్యజీవన్, డా.లీనా సుప్రియ, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకర్, కేబీకే రమేష్‌రెడ్డి, పి ఎలిజబెత్, ఎస్‌కే అమేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నరసాపురం: కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నరసాపురం నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కామన బుజ్జి సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మేడే సందర్భంగా సోమవారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం కోసం రాజ్యాంగం అనేక చట్టాలు రూపొందించిందన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగితే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చిని చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే విశేషాలు వివరించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి యర్రంశెట్టి ఫణీకర్ పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాలకు జలాభిషేకం



గాంధీజీ విగ్రహం వద్ద జలాభిషేకాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

- వినూత్న కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శ్రీకారం

నరసాపురం: ఇటీవల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న కె.వెంకటేశ్వరరావు కొద్దిరోజుల్లోనే సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధం, వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు ప్రజల మన్ననలు పొందాయి. తాజాగా ఆయన పట్టణంలోని అన్ని కూడళ్లు, వార్డుల్లోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్, ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి వంటివారి విగ్రహాలను శుభ్రపరిచే జలాభిషేకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శివాలయం సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుభ్రం చేసి మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇకపై ప్రతి నెలా 1వ తేదీన విగ్రహాలను నీటితో శుభ్రం చేస్తామని కమిషనర్ చెప్పారు. జాతీయ నాయకుల విగ్రహాలు కూడళ్లలో దుమ్ము పట్టి ఉంటున్నాయని, ప్రతీనెలా ఓ కార్యక్రమంగా పెట్టుకుని వాటిని శుభ్రం చేస్తే ఈ పరిస్థితి ఉండదన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందజేయాలని, వేధింపులు ఆపాలని పశ్చిమగోదావరి జిల్లా గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల సంఘ నాయకుడు ఎం ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం సిద్ధాంతంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్ధాంతం, ములపర్రు, చినమల్లంలో కార్మికులపై వేధింపులు పెరిగాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు డి నాగార్జున, తామరాడ, దొంగరావిపాలెం, నడిపూడి, మునమర్రు పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం

పాలకొల్లు అర్బన్: ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మిషన్ 50 గోటు విలేజ్ కార్యక్రమాన్ని సోమవారం చింతపర్రులో నిర్వహించినట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి పసుపులేటి చినబాబు అన్నారు. 29 ఏళ్ల నుంచి మాదిగల ఆత్మ గౌరవం కోసం ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆకుమర్తి కుమార్‌రాజు, తవిటిక సుబ్బారావు, ఇశ్రాయేలు, శ్యాంబాబు, ఆల్ఫ్రెడ్, ఆకుమర్తి బుద్దేశ్వరరావు, ఆకుమర్తి రాము, ఆకుమర్తి చక్రపాణి, తవిటక కోటమ్మ, ఉండ్రాజవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



లంకలకోడేరు గ్రామ సచివాలయం వద్ద ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహం

పాలకొల్లు అర్బన్: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడచుకోవాలని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కర్రి జోగయ్య అన్నారు. మండలంలోని లంకలకోడేరు గ్రామ సచివాలయం వద్ద మత్తే వెంకటేశ్వరరావు - కృపమ్మ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ ఆవరణలో ఇప్పటికే కొంతమంది జాతీయ నాయకుల విగ్రహాలు ఆవిష్కరించారు. పంచాయతీ తీర్మానం ప్రకారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని జోగయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కూనపరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), ఎంపీటీసీ ఆకుల ధనలక్ష్మి, గ్రామ పెద్దలు జవ్వాది వీర వెంకట సత్యనారాయణ, ఆరేపల్లి సింహాద్రి, చిన్నా, పంచాయతీ కార్యదర్శి సీతారామరాజు, విగ్రహ దాతలు మత్తే వెంకటేశ్వరరావు- కృపమ్మ దంపతులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

భీమవరం అర్బన్ : మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో తూర్పుకాపుల పేటలో తాచ్చెరువు గట్టుపై రూ.10 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బీవీ రాజు ఫౌండేషన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ శ్రీ విష్ణురాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న విష్ణురాజుకు గ్రామ పెద్దలు వీవీఎస్ సూర్యనారాయణ రాజు, వి.బలరామరాజు, సూర్యనారాయణ రాజు, పి.నీలకంఠం మాస్టార్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా అల్లాడ

పెనుమంట్ర: జాతీయ చేనేత ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా మార్టేరు గ్రామానికి చెందిన అల్లాడ సూర్యభాస్కరరావు నియమితులయ్యారు. తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో యువజన అధ్యక్షుడిగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా సూర్యభాస్కరరావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

76 శాతం పింఛన్ల పంపిణీ

మొగల్తూరు: మండలంలోని 17 గ్రామాలు, 21 సచివాలయాలకు సంబంధించి 79.69 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆర్‌సీ ఆనందకుమార్ తెలిపారు. మండలంలోని 10,486 పింఛన్లకు సోమవారం నుంచి పంపిణీ ప్రారంభించగా సాయంత్రానికి 7,989 మందికి పింఛన్లు అందించామన్నారు. మరో రెండు రోజుల్లో పింఛన్లు పంపిణీ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.